

రోడ్‌షో.. ఫుల్‌జోష్..



గచ్చిబౌలి: పార్లమెంటు ఎన్నికలలో భాగంగా శేరిలింగంపల్లిలోని కొండాపూర్‌లో సోమవారం రాత్రి మాజీ మంత్రి కేటీరామారావు రోడ్‌షోకు భారీగా జనం హాజరయ్యారు. ముఖ్యంగా 80 శాతం మహిళలే కనిపించారు. ఆదివారం నుంచే భారీ జనసమీకరణకు ఎమ్మెల్యే, కార్పొరేటర్లు, ఇన్‌చార్జీలు, సీనియర్ నాయకులు సమావేశమై జనసమీకరణపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో ఇది సాధ్యమైందని పార్టీ వర్గాలు తెలుపుతున్నాయి. భారీగా జనం రావడంతో పోలింగ్ నాటికి ప్రచారం ఉధృతం చేయాలని నిర్ణయించినట్లు నాయకులు తెలిపారు.





మియాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా గుంతలు పడ్డ రోడ్డు



రాకపోకలు ఎలా..?

తవ్వి వదిలేయడంతో గుంతలమయంగా రోడ్లు ● ఇబ్బందులుపడుతున్న ప్రజలు

మియాపూర్: రోడ్లపై నడవలేని పరిస్థితి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన రోడ్లను వివిధ అవసరాల కోసం తవ్వి అలాగే వదిలేస్తున్నారు. తాగునీటి పైప్‌లైన్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, వరదనీటి పైప్‌లైన్ పనుల నిమిత్తం సీసీ రోడ్లను తవ్వుతున్నారు. పనులు పూర్తయిన తర్వాత వాటిని బాగు చేయకపోవడం, తవ్విన ప్రాంతంలో మట్టిపోసి వదిలేయడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి స్థానిక ప్రజలు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

- మియాపూర్ డివిజన్ పరిధిలోని ఏఎస్‌రాజునగర్ ,విశ్వేశ్వర కాలనీ, కృషినగర్‌లలో డ్రైనేజీ, వరదనీటి పైపులైన్ పనుల కోసం అంతర్గత రహదారులను తవ్వి పనులు పూర్తి అయ్యాక నెలలు గడుస్తున్నా ప్యాచ్ వర్కులు, సీసీ రోడ్డు పనులు చేపట్టడం లేదు.
- మ్యాన్‌హోల్స్ రోడ్డుకంటే పైకి, కొన్ని ప్రాంతాల్లో కిందకు ఉండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు.
- తవ్వి వదిలేసిన రోడ్డులో మట్టి ఉండడం వల్ల వాహనాల రాకపోకలతో దుమ్ము ఇళ్లలోకి చేరుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- మియాపూర్ పోలీస్‌స్టేషన్ ముందు రోడ్లను తవ్విన ప్రాంతంలో పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.
- అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి త్వరగా రోడ్డు పనులు చేపట్టాలని కోరుతున్నారు.



మియాపూర్ ఏఎస్‌రాజునగర్‌లో రోడ్డు తవ్వి వదిలేసిన దృశ్యం

నాసర్ స్కూల్‌లో 100 శాతం ఉత్తీర్ణత

ఐసీఎస్‌ఈ, ఐఎస్‌సీ సిలబస్ ఫలితాలు విడుదల

రాయదుర్గం: పదవ తరగతి (ఇండియన్ సర్టిఫికెట్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్-ఐసీఎస్‌ఈ), పన్నెండవ తరగతి(ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్-ఐఎస్‌సి) ఫలితాలను సోమవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో గచ్చిబౌలిలోని నాసర్ బాయ్స్ స్కూల్‌లో ఫలితాలను వైస్ ప్రిన్సిపల్ రెనిఫ్‌థామస్, హెచ్‌ఎం కె మధుసూదన్, హెడ్ మిస్ట్రెస్ అయేషాఫాతిమా, కె జయలక్ష్మీ ప్రకటించారు. నాసర్ బాయ్స్ స్కూల్‌లో పది, పన్నెండు తరగతుల్లో 100 శాతం ఫలితాలను సాధించినట్లు ప్రకటించారు. ఐసీఎస్‌ఈ సిలబస్ పదవ తరగతిలో డిస్టింక్షన్‌లో 35 మంది ఉత్తీర్ణులు కాగా, ఫస్ట్ క్లాస్‌లో 40 మంది, సెకండ్ క్లాస్‌లో 11 మంది ఉత్తీర్ణులయ్యారు. అందరిలో స్కూల్ టాప్ త్రీలో సర్మద్ అహ్మద్ 96.2 శాతం, సయ్యద్ మహ్మద్ అక్మల్ 95.4 శాతం, శౌర్యా కుమార్ పటేల్ 95.2 శాతం మార్కులు సాధించారు. కాగా పన్నెండవ తరగతిలో డిస్టింక్షన్‌లో నలుగురు, ఫస్ట్‌క్లాస్‌లో ముగ్గురు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో స్కూల్ టాపర్లుగా పి వివేక్‌సింగ్ 90.5 శాతం, ధనుష్‌వర్మ 86.5, జైడిన్ బ్లా షాన్‌ప్రోకు 78 శాతంతో టాపర్లుగా నిలిచారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపల్, హెడ్‌మాస్టర్, హెడ్ మిస్ట్రెస్‌లు అభినందించారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి



హఫీజ్‌పేట్: కొండాపూర్ డివిజన్ పరిధిలోని ప్రేమ్‌నగర్‌కు చెందిన సీనియర్ నాయకులు ఇమామ్ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరి మరల తిరిగి సోమవారం ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీ పటిష్టతకు సైనికులుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, సాంబశివరావు, జంగయ్య యాదవ్, బ్రిక్ శ్రీను, కరీం, సాంబయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరికలు



శేరిలింగంపల్లి: చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమని ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. శేరిలింగంపల్లి నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు కుమార్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ యాదవ్‌ల ఆధ్వర్యంలో యూత్ సభ్యులు, యువ నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం హామీల అమలుకు చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి గెలుపు ఖాయం అన్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో..

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ సమక్షంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం సాయినగర్ వెస్ట్, ఈస్ట్ కాలనీకి చెందిన కాలనీవాసులు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. సంజీవ్ రెడ్డి, దొడ్ల రామకృష్ణ గౌడ్, సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, ప్రభాకర్, శివరాజ్ గౌడ్, భాస్కర్‌రెడ్డి, బత్తిన వెంకటేష్‌గౌడ్, నరసింగరావు, దొడ్ల భారత్‌గౌడ్, రఘు, శ్రీనివాస్, సుబ్బారావు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న జగదీశ్వర్ గౌడ్

టాస్కులు, కమీషన్‌ల పేరిట సైబర్ మోసం

- రూ.15 లక్షల 21 వేలు పోగొట్టుకున్న బాధితుడు
- సైబర్ వలలో ఎక్స్ సర్వీస్‌మెన్

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ అంటూ వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన ఎక్స్ సర్వీస్‌మెన్ రూ.15 లక్షల 21 వేలు పోగొట్టుకున్న సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం...పటాన్‌చెరు మండలం ఇంద్రేశం గ్రామానికి చెందిన ఎక్స్ సర్వీస్‌మెన్‌కు పార్ట్ టైం జాబ్ అంటూ ఏప్రిల్ 26 వ తేదీ ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో ఎక్స్ సర్వీస్‌మెన్ తన వివరాలను నమోదు చేశాడు. దీంతో సైట్ నిర్వాహకులు అతనికి ఒక వాలెట్ ఐడి క్రియేట్ చేసి ఇచ్చారు. దీంతో ఎక్స్ సర్వీస్‌మెన్ ముందుగా రూ.2 వేలు చెల్లించి ఇచ్చిన టాస్కులు చేయడం మొదలుపెట్టాడు. కాగా తాను పెట్టిన నగదును సైబర్ నేరగాళ్లు తనకిచ్చిన వాలెట్‌లో చూపిస్తూ వచ్చారు. ఈ క్రమంలో బాధితుడు మొత్తం రూ.15 లక్షల 21 వేలు చెల్లించాడు. చివరిగా తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్ ఇవ్వాలని అడగగా స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

8న 'మనూ'లో ప్లేస్‌మెంట్ డ్రైవ్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఈనెల 8వ తేదీన ఉదయం పది గంటలకు పాలిటెక్నిక్ భవనంలో ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తామని 'మనూ' ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ యూసుఫ్‌ఖాన్ సోమవారం తెలిపారు. 'మనూ', విజన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఎస్‌సీ, ఐటీఐ, డిప్లొమో పూర్తి చేసిన విద్యార్థులకు అవకాశాలు కల్పిస్తారన్నారు.2023-24లో మనూలో ఎస్ఎస్‌సీ, ఐటీఐ లేదా పాలిటెక్నిక్ పూర్తి చేసినవారు, ఇతర పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పాల్గొనవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ యూసుఫ్‌ఖాన్: 9848171044, సమీర్‌పాషా: 9700064077, ప్రదీప్: 8960363488లలో సంప్రదించాలని కోరారు.

నేడు రాయదుర్గంకు అన్నామలై రాక

రాయదుర్గం: బీజేపీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై నేడు రాయదుర్గంకు రానున్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ నాయకత్వంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు బైక్ ర్యాలీని ప్రారంభిస్తారు. ఈ ర్యాలీ మధురానగర్, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, విప్రో సర్కిల్, ట్రిపుల్ ఐటీ జంక్షన్, గచిబౌలి సంధ్యా కన్వెన్షన్ వరకు సాగుతుంది.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల డిజైర్స్ సొసైటీలో వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో భాగంగా ఎయిడ్స్ బాధిత చిన్నారులకు పలు క్రీడా పోటీలను నిర్వహించారు. క్రీడల్లో గెలుపొందిన చిన్నారులకు స్థానిక సీఐ గంగాధర్ బహుమతులను అందించారు.

అభివృద్ధి చూసి ఓటు వేయండి



తారానగర్‌లో బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం

- కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్
- తారానగర్, లింగంపల్లిలో ఇంటింటి ప్రచారం

శేరిలింగంపల్లి: కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల అమలు, రాష్ట్రాభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటు వేయాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ తారానగర్, లింగంపల్లి విలేజ్, రామయ్యనగర్, బృందావన్ కాలనీల్లో ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ఓటు వేయాలని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాగేందర్ యాదవ్ మాట్లాడుతూ ప్రచారంలో తమకు ప్రజా స్పందన బాగుందన్నారు. చేవెళ్ళలో బీఆర్‌ఎస్ జెండా ఎగురడం ఖాయం అన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వీరేశంగౌడ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షులు రాజుయాదవ్, నాయకులు శ్రీనివాస్‌రాజ్ ముదిరాజ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ఆదేశాల మేరకు బీఆర్‌యస్ నాయకులు ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆల్విన్‌కాలనీ ఫేజ్ 2, ఆదిత్య నగర్, రాఘవేంద్ర కాలనీ, సాయినగర్ వెస్ట్ కాలనీల్లో ప్రచారంలో కాలనీ అధ్యక్షుడు కృష్ణారావు, కట్ట శ్రీను, రాజేష్ చంద్ర, కాశీనాద్ యాదవ్, చిన్నోళ్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆల్విన్‌కాలనీ డివిజన్ మాజీ అధ్యక్షుడు జిల్లా గణేష్ మాట్లాడుతూ బీఆర్‌యస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌కు ఓట్లు వేసి గెలిపించాలన్నారు.

ఎంసీపీఐయూ ప్రచారం

మియాపూర్: బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్ చేవెళ్ల పార్లమెంట్ ఎంసీపీఐయూ అభ్యర్థి వనం సుధాకర్‌ను గెలిపించాలని ఎంసీపీఐయూ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి మైదంశెట్టి రమేష్ కోరారు. సోమవారం మియాపూర్‌లోని స్టాలిన్ నగర్ కాలనీలో ఎంసీపీఐయూ అభ్యర్థి వనం సుధాకర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కంప్యూటర్ గుర్తుకు ఓటువేసి వనం సుధాకర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, భాగ్యమ్మ, గణేష్,దశరథ్ నాయక్,లావణ్య, చందర్,సుల్తానాబేగం, రాజు తదితరులు పాల్గొన్నారు.



స్టాలిన్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న ఎంసీపీఐయూ నాయకులు

తాగునీటి వృథా

రామచంద్రాపురం(పటాన్‌చెరు): అసలే ఎండాకాలం ..నీరు వృధాగా పోతున్న పట్టించుకునే వారు కరువయ్యారు. ఓవైపు నీటి సమస్య ఉంటే మరోవైపు వృధాగా పోతుండడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జ్యోతిరావు పూలే కాలనీలో రెండు నెలలుగా తాగునీరు వృధాగా పోతుంది. అధికారుల దృష్టికి తీసుకుపోయినా పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు.

గెలుపు బీజేపీదే..



హైదర్‌నగర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు రవికుమార్ యాదవ్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ కృష్ణవేణినగర్, శ్రీరామనగర్ కాలనీలో బీజేపీ శేరిలింగంపల్లి నాయకుడు రవికుమార్ యాదవ్ ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరోసారి నరేంద్ర మోదీ నాయకత్వంలో పార్టీ ఘన విజయం సాధించబోతున్నదని ధీమా వ్యక్తం చేశారు.

శేరిలింగంపల్లి: బీజేపీ చేవెళ్ల అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి మద్దతుగా ఆదర్శనగర్, గోపీనగర్, నెహ్రూనగర్, బాపూనగర్‌లలో సోమవారం రాత్రి రవికుమార్ యాదవ్ ప్రచారం నిర్వహించారు. ప్రజా సేవకోసమే కొండా విశ్వేశ్వర్‌రెడ్డి రాజకీయాల్లోకి వచ్చారని, 13వ తేదీ జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

హఫీజ్‌పేట్: పార్లమెంట్ ఎన్నికల రాహుల్ గాంధీ నాయకత్వం బలపరిచే విధంగా చేవెళ్ల అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డిని గెలిపిస్తామని శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ పేర్కొన్నారు. సోమవారం మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్లలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామన్నారు. అన్ని వర్గాల అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమన్నారు. డాక్టర్ రంజిత్‌రెడ్డికి సంపూర్ణ మద్దతుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీహబ్‌ను సందర్శించిన హెల్త్ సర్వీసెస్ బృందం

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌ను ఎవర్నార్త్ హెల్త్ సర్వీసెస్ ప్రపంచ నాయకత్వ బృందం సోమవారం సందర్శించింది. ఈ బృందానికి హెల్త్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ వెంకటాచలం నాయకత్వం వహించారు. టీహబ్ బృందంతో పాటు భారత్‌లోని సంస్థ హెచ్‌ఆర్ డైరెక్టర్ యదుకిషోర్ వారికి స్వాగతం పలికారు. ఈ బృందం ఆరోగ్య సంరక్షణ ఆవిష్కరణలను పరిశీలించింది. ఆరోగ్య సంరక్షణ, సాంకేతికతలో టీహబ్ యొక్క పర్యావరణ వ్యవస్థ స్టార్టప్‌ల ప్రతినిధులు, డైనమిక్ కమ్యూనిటీతో వారు చర్చలు జరిపారు. ఆరోగ్య సంరక్షణ, ఇతర సాంకేతిక పురోగతిలో కలిసి పనిచేయాలని నిర్ణయించారు.

రాంగ్‌రూట్.. 12మందిపై కేసులు నమోదు

మియాపూర్: ప్రధాన రహదారిపై యూటర్న్‌ల వద్ద రాంగ్‌రూట్‌లో వస్తున్న 12 మంది ద్విచక్ర వాహనదారులపై మియాపూర్ పోలీసులు సోమవారం కేసులు నమోదు చేశారు. మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ ఆధ్వర్యంలో రాంగ్‌సైడ్ డ్రైవ్ అండ్ స్పెషల్ డ్రైవ్‌లో పలు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేశారు. మియాపూర్‌లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు యూటర్న్ ,లేబర్ అడ్డా వద్ద అడ్డదారిలో వెళ్తున్న వారిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ తెలిపారు.

భవనంపై నుంచి పడి మేస్త్రీ మృతి



జోగారావు(ఫైల్)

గచ్చిబౌలి: నిర్మాణంలో ఉన్న భవనం పై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఓ మేస్త్రీ మృతి చెందిన సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి తెలిపిన ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా, సర్వతోట మండలం, హర్లీ గ్రామానికి చెందిన టి.జోగారావు(35) బతుకు దెరువు కోసం నగరానికి వలస వచ్చాడు. మూసాపేట్‌లో నివాసం ఉంటూ గొలిదొడ్డిలోని కేశవ్‌నగర్‌లో రాజారావు అనే కాంట్రాక్టర్ వద్ద మేస్త్రీగా పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం 11.30 గంటల సమయంలో నాల్గవ అంతస్తులో పని చేస్తూ జారి లిఫ్ట్ గుంతలో పడిపోయాడు. తలకు తీవ్రగాయాలై జోగారావు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆ ముగ్గురూ లోకల్

ఉమ్మడి మెదక్ జిల్లా రాజకీయాల్లో పటాన్‌చెరుకు ప్రత్యేక స్థానం ఉంది. ఈ ప్రాంత నేతలు అనేక కీలక పదవులు అధిష్ఠించి పాలిటిక్స్‌లో చురుకుగా వ్యవహరించారు. అయితే మెదక్ లోక్‌సభ స్థానానికి అంతర్జాతీయ స్థాయిలో పేరుంది. ఇందిరాగాంధీ ఇక్కడ నుంచే పోటీ చేసి గెలుపొందిన సంగతి తెలిసిందే. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ స్థానం నుంచి పోటీ చేస్తున్న ముగ్గురు ప్రధాన ప్రత్యర్థులు పటాన్‌చెరు ప్రాంతానికి చెందిన వారే కావడం విశేషం.

- పటాన్‌చెరు నియోజకవర్గంలో అధిక ఓటర్లు
- ప్రధానంగా పారిశ్రామికవాడపై ప్రత్యేక దృష్టి
- ఓట్ల కోసం విస్తృత ప్రచారం

మెదక్ ఎంపీ స్థానానికి పటాన్‌చెరు వాసులు పోటీ



బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు



కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు



బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

పటాన్‌చెరు: బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు పటాన్‌చెరులోనే చాలాకాలం విలేకరిగా పనిచేసి పేరు పొందారు. ఆయన గతంలో తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి పారిశ్రామిక వాడ రాజకీయాల్లో చురుకుగా పాల్గొన్నారు. రఘునందన్ దుబ్బాక నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలుపొందక ముందు పటాన్‌చెరు పట్టణంలో తన సొంతింటిలో ఉండేవారు. అలాగే కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ పటాన్‌చెరు మండలం చిట్కుల్ నివాసి. ఆయన గతంలో తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. జెడ్పీటీసీగా పటాన్‌చెరు నుంచి అప్పటి టీఆర్‌ఎస్ తరపున పోటీచేసి స్వల్ప మెజార్టీతో ఓడిపోయారు. ఈ ప్రాంతంలోని ప్రతీ సమస్యపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. బీఆర్‌ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి పటాన్‌చెరు నియోజకవర్గం తెల్లాపూర్ మున్సిపాల్టీలోని గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటున్నారు. ఆయన బంధువులకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపార సంస్థ కొన్ని వందల ఇళ్లను ఈ ప్రాంతంలో నిర్మించింది. తెల్లాపూర్ మున్సిపాల్టీలో ఆయనకు మంచి పరిచయాలు ఉన్నాయి. ఆయన గతంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా కూడా పని చేశారు. అప్పట్లో ఆయన పటాన్‌చెరు, ఆర్సీపురం పట్టణ పౌరులతో మంచి సంబంధాలు ఉండేవి.

పారిశ్రామిక వాడలోని ఓట్లపైనే గురి

మెదక్ లోక్‌సభ పరిధిలో సిద్దిపేట, మెదక్, నర్సాపూర్, సంగారెడ్డి, పటాన్‌చెరు, దుబ్బాక, గజ్వేల్ నియోజకవర్గాలు ఉన్నాయి. పటాన్‌చెరులో అధికంగా ఓటర్లు ఉంటారు. దీంతో మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఈ నియోజకవర్గంపైనే దృష్టి సారించారు. వారికున్న వ్యక్తిగత సంబంధాలు, పరిచయాలతో ఇక్కడి ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ముగ్గురు ఇక్కడే ఎక్కువగా ప్రచారం చేస్తున్నారు. ఉత్తర భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి స్థిరపడిన వారందరూ తమకే ఓటు వేస్తారని లెక్కలు వేసుకుంటున్నారు. ఒడిశా, బిహార్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్, తదితర ప్రాంతాల నుంచి వచ్చి స్థిరపడిన కార్మికులను దగ్గర చేసుకునేందుకు ఎంపీ అభ్యర్థులు సభలు సమావేశాలు నిర్వహిస్తున్నారు. బొల్లారం, అమీన్‌పూర్ పట్టణాల్లో బీజేపీ కౌన్సిలర్లు ఉండగా, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి అన్నివర్గాలతో సత్సంబంధాలు ఉన్నాయి. అన్ని పారిశ్రామిక వాడల్లోనూ నీలం మధుకు వలస కార్మికులతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఆయనకున్న పరిచయాలతో పటాన్‌చెరు ప్రాంతంలో అధిక ఓట్లు కొల్లగొట్టాలనే ప్రయత్నంలో ఉన్నారు.

18 సార్లు మెదక్ లోక్‌సభకు ఎన్నికలు

మెదక్ లోక్‌సభకు ఇప్పటి వరకు 18 సార్లు ఎన్నికలు జరిగాయి. అందులో కాంగ్రెస్ అభ్యర్థులు 1957, 62లో పి.హన్మంతరావు, 1967లో సంగెం లక్ష్మీబాయి, 1980లో ఇందిరాగాంధీ, 1984, 89, 91, 96, 98లో వరుసగా బాగారెడ్డి విజయం సాధించారు. 1999లో ఆలె నరేంద్ర బీజేపీ నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2004లో కూడ ఆయనే అప్పటి టీఆర్‌ఎస్-కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలుపొందారు. 2009 తర్వాత టీఆర్‌ఎస్ ప్రభంజనం కొనసాగింది. 2009లో విజయశాంతి, 2014లో కేసీఆర్, 2014 ఉప ఎన్నికల్లో కొత్త ప్రభాకర్‌రెడ్డి గెలిచారు. 1971లో తెలంగాణా ప్రజా సమితి తరపున మల్లికార్జున్ పోటీ చేసి ఎంపీగా గెలిచారు. 2019లో టీఆర్‌ఎస్(కొత్త ప్రభాకర్‌రెడ్డి)కు 5,96,048 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్(గాలి అనిల్ కుమార్) కు 2,79,621 ఓట్లు పడగా, బీజేపీ నుంచి రఘునందన్‌రావుకు 2,01,567 ఓట్లు వచ్చాయి. 2014లో కేసీఆర్‌కు 6,57,492 ఓట్లు వచ్చాయి.

తెలంగాణ ఉద్యమానికి మద్దతు

ఇప్పటివరకు జరిగిన మెదక్ ఎంపీ ఎన్నికల్లో ఓటర్లు తెలంగాణ ఉద్యమానికి మద్దతిచ్చినట్లు స్పష్టమవుతుంది. అయితే దుబ్బాకలో బీజేపీ ఉప ఎన్నికలో ఓటర్లు రఘునందన్‌రావుకు ఇచ్చిన విజయం, గతంలో ఇక్కడ ఆలె నరేంద్రను బీజేపీ నుంచి విజయం వరించిందనే లెక్కలుకడుతూ బీజేపీ తన విజయవకాశాలను అంచనా వేస్తుంది. అయితే నరేంద్ర తర్వాత బీజేపీకి ఓటర్ల మద్దతు పెద్దగా లేదనే చెప్పాలి. బాగారెడ్డి తర్వాత జిల్లాలో కాంగ్రెస్‌కు ఎంపీ స్థానం లేకపోవడంతో ఈసారి ఎలాగైనా నెగ్గాలనే లక్ష్యంతో ఏఐసీసీ, పీసీసీ వర్గాలు ప్రణాళికలు రచించాయి. అందరి అంచనాల్లోనూ పటాన్‌చెరు ఓటర్లే కీలకం.

పటాన్‌చెరు శాసనసభ ఎన్నికల్లో..

ఇటీవల 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పటాన్‌చెరు బీఆర్‌ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డికి 1,05,387 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి కాట శ్రీనివాస్‌గౌడ్‌కు 98,296 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 19,963 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పోటీ చేస్తున్న నీలం మధు ముదిరాజ్ 2023 ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన సంగతి తెలిసిందే. ఆయనకు 46,162 ఓట్లు వచ్చాయి.